పండ్ల తోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, అక్టోబర్ 3: పండ్ల తోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈజీఎస్, ఉద్యానశాఖ ద్వారా పండ్ల తోటల పెంపకానికి, బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వం పోత్సాహకం అందిస్తున్నదని తెలిపారు. మామిడి, బత్తాయి, నిమ్మ, సీతాఫలం, సపోట, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు, దానిమ్మ, కొబ్బరితోపాటు పలు పండ్లతోటల పెంపకాన్ని ప్రభుత్వం నాలుగేండ్ల వరకు రాయితీలు, పోత్సాహకాలు అందిస్తున్నదని చెప్పారు. రైతుల ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

అమ్మవారి దర్శనం కోసం నెత్తిన బోనంతో క్యూలో బారులు తీరిన భక్తులు

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

వేములవాడ టౌన్, అక్టోబర్ 3: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని, నెత్తిన బోనంతో క్యూలో బారులు తీరారు. కల్లు పోసి, సారెపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పర్యవేక్షకుడు హరిహరనాథ్ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, వెంకటేశ్, శివరాజ్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

నిత్యం వేదాన్ని సాధన చేయాలి

- రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్
- ముగిసిన ధూపదీప, నైవేద్య స్కీం అర్చకుల పునఃశ్చరణ తరగతులు

శిక్షణ ఇచ్చిన అర్చకులను సన్మానిస్తున్న ఈవో కృష్ణప్రసాద్, రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ టౌన్, అక్టోబర్3: అర్చకులు నిత్యం వేదాన్ని సాధన చేయడంతో ప్రావీణ్యం పొందాలని వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ధూపదీప, నైవేద్య స్కీం అర్చకులకు సూచించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్ నిర్వహించిన అర్చకుల పునఃశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఈవో హాజరై మాట్లాడారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్ జోన్ దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, అర్చక వృత్తి చాలా పవిత్రమైందన్నారు. పునఃశ్చరణ శిక్షణ ఇచ్చిన ఉప ప్రధాన అర్చకుడు నమిలకొండ రాజేశ్వరశర్మ, చంద్రగిరి శరత్‌శర్మ, మడికొండ విజయ్‌శర్మను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, రాజన్న ఆలయ ఏఈవో హరికిషన్, పర్యవేక్షకుడు వీరస్వామి, ఈవో వెంకన్న, ఎన్ శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో ఉప కమిషనర్

వేములవాడ రాజన్నను వరంగల్ జోన్ దేవాదాయశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్ దర్శించుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో కృష్ణప్రసాద్ ప్రసాదం అందించారు.

వరంగల్ జోన్ ఉప కమిషనర్‌కు ప్రసాదం అందిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

ఓపెన్ స్లాబ్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరైన అర్చకులు

యూత్ మండలాధ్యక్షుడిగా నవీన్

దండుగుల నవీన్

కోనరావుపేట, అక్టోబర్ 3: మండల కేంద్రంలో ఆయా గ్రామాల ఒడ్డెర సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా యూత్ మండలాధ్యక్షుడిగా దండుగుల నవీన్, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి కళ్యాణ్, ఉపాధ్యక్షుడిగా పల్లపు గణేశ్, కార్యదర్శిగా అల్లెపు పవన్ కళ్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

బీఆర్ఎస్ జోగాపూర్ కార్యవర్గం

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

చందుర్తి, అక్టోబర్ 3: జోగాపూర్‌లో బీఆర్ఎస్ నూతన కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా గొల్లపల్లి పరశురాములు, ఉపాధ్యక్షుడిగా తుపాకుల శ్రీను, యూత్ అధ్యక్షుడిగా గొల్లపల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా ఇంగే రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా అమరబండ జలంధర్, కార్యదర్శిగా ఎండీ షారుక్, బూత్ కమిటీ అధ్యక్షులుగా తుపాకుల శ్రీను, ఇంగే రాకేశ్ ఎన్నికయ్యారు. తమ నియామకానికి సహకరించిన మండలాధ్యక్షుడు ఎల్లయ్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సర్పంచ్ మ్యాకల పరశురాములు ఉన్నారు.

గొర్రెల యూనిట్ పరిశీలన

గొర్రెల పెంపకం వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థినులు

చందుర్తి, అక్టోబర్3: మండల కేంద్రలోని గొర్రెల యూనిట్‌ను రావెప్ విద్యార్థినులు మంగళవారం సందర్శించారు. యజయాని చిలుక పెంటయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొర్రెల పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై ఆరా తీశారు. ఇక్కడ పశు వైద్యాధికారి నితిన్, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం



సెస్ డైరెక్టర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, నాయకులు

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

బోయినపల్లి, అక్టోబర్3: రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రధాన ధ్యేయమని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కోరెం గ్రామంలో 3ఫేస్ నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిక్కాల మాట్లాడుతూ, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామానికీ విద్యుత్, వైద్యం, సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, చొప్పదండి సుంకె రవిశంకర్ సహకారంతో కోరెంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏడీ ఈ శ్రీధర్, ఏఈ జీ ప్రశాంత్, ఏఏవో సతీశ్, కోరెం సర్పంచ్ చెన్నాడి రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ రోహిణి, ఎంపీటీసీ డబ్బు మమత, బీఆర్ఎస్ నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్, సృజన్‌రెడ్డి, కిరణ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చందుర్తి, అక్టోబర్3: మూడపల్లి, మల్యాల, లింగంపేట, కట్టలింగంపేట గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉచితంగా పరీక్షలు చేశారు. అవసరం ఉన్నవారికి మందులు అందించారు. ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌కుమార్ సూచించారు. ఇక్కడ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సంపత్ కుమార్, సిబ్బంది

నేడు కొలువుదీరనున్న పోతుగల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం

- చైర్మన్‌గా అక్కరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా నాగుల శ్రీనివాస్ నియామకం

ముస్తాబాద్, అక్టోబర్ 3: పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం కొలువుదీరనున్నది. చైర్మన్‌గా మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా నాగుల శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. 1998లో సిరిసిల్ల మార్కెట్ కమిటీ నుంచి వేరుచేసి పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 2002 వరకు కార్యదర్శుల పాలనలో ఉన్నది. 2002 నుంచి 2004 వరకు మద్దికుంటకు చెందిన సురభి సురేందర్‌రావు, 2006-2009 వరకు అన్నం బాల్‌లింగారెడ్డి (ముస్తాబాద్), 2013-2015వరకు చిట్నేని ఆంజనేయరావు (గూడెం), 2016-2018వరకు బత్తుల అంజయ్య (ముస్తాబాద్), 2018-2020 వరకు ఉల్లి యాదిమల్లేశ్‌యాదవ్ (తెర్లుమద్ది), 2020-2022 వరకు శీలం జానాబాయి (ముస్తాబాద్) చైర్మన్లుగా వ్యవహరించారు.

తొలిసారిగా పోతుగల్‌వాసికి అవకాశం..

పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పోతుగల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్‌కు మంత్రి కేటీఆర్ తొలిసారిగా అవకాశం కల్పించారు. వైస్‌చైర్మన్‌గా నాగుల శ్రీనివాస్, డైరెక్టర్లుగా కొత్తపల్లి నారాయణ, బొమ్మెన ఆంజనేయులు జూకంటి ప్రమోద్‌రావు, జింనుక మల్లేశం, రొడ్డ దేవదాస్, ముషికం దేవయ్య, బొయినిపల్లి రామారావు, అన్నమనేని సునంద, దుద్దెడ రాజు, ముక్క మల్లయ్యతో పాటు పోతుగల్ పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, సర్పంచ్ తన్నీరు గౌతంరావు, వెల్ముల హన్మంతరావు, పొట్లపల్లి వినయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

గల్ఫ్ నుంచి తిరిగొస్తుండగా..

- బండపల్లివాసి అదృశ్యం

మోహన్‌రెడ్డి

చందుర్తి, అక్టోబర్3: జీవనోపాధి కోసం సౌదీ వెళ్లి స్వగ్రామానికి తిరిగివస్తున్న క్రమంలో బండపల్లి గ్రామానికి చెందిన గడ్డం మనోహర్‌రెడ్డి అలియాస్ మోహన్‌రెడ్డి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డం మనోహర్‌రెడ్డి నాలుగేండ్ల క్రితం సౌదీ వెళ్లాడు. స్వదేశానికి తిరిగి వస్తున్న క్రమంలో గత నెల 11న కేరళలోని కొచ్చిన్‌లో గల ఆల్వ రైల్వేస్టేషన్ నుంచి తన భార్య మమతకు ఫోన్ చేశాడు. బండపల్లికి రావడానికి డబ్బులు లేవని, ఫోన్ ద్వారా పంపాలని కోరాడు. మమత వెంటనే నగదు పంపి సద రు నంబర్‌కు ఫోన్ చేయగా, బిహార్‌కు చెందిన వ్యక్తి మాట్లాడాడు. మనోహర్‌రెడ్డి కేరళ ఆల్వ రైల్వేస్టేషన్ వద్దే ఉన్నాడని అతడు చెప్పాడు. అప్పటి నుంచి సమాచారం లేకపోవడంతో మమ త ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.